AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAY.IN


1-4-2026 (Wednesday) | MAIN EDITION

## దోపిడీ చేయడమే చంద్రబాబు పని: జగన్



**అక్షరటుడే, ఏపీ:** చంద్రబాబుకు నిజాయితీ, చిత్తశుద్ధి లేదని మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ విమర్శించారు. పరిపాలన అంటే బాబు దృష్టిలో దోపిడీ, అవినీతి మాత్రమేనని ఆరోపించారు. చంద్రబాబు సీఎంగా ఉండడం ఏపీ ప్రజలు చేసుకున్న దురదృష్టమన్నారు. అమరావతి చట్టబద్ధత తీర్మానం విషయంలోనూ డ్రామాలు ఆడారని విమర్శించారు. తాను చేసే దోపిడీ నుంచి డైవర్ట్ చేసేందుకు బాబు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. రాజధానిపై తీర్మానం అవసరం లేదని మంత్రి పార్థసారథి స్టేట్‌మెంట్ ఇచ్చారని గుర్తు చేశారు.

## సహకార బ్యాంక్‌లో మద్యం తాగిన ఉద్యోగులు



**అక్షరటుడే, యాదాద్రి భువనగిరి:** సహకార బ్యాంక్‌ను కొందరు ఉద్యోగులు బార్‌గా మార్చారు. ప్రజలకు సేవలు అందించాల్సిన చోట.. అర్ధరాత్రి వేళ మద్యం సిట్టింగ్ వేశారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటు చేసుకుంది. మోత్కూరు పీఏసీఎస్ బ్యాంకులో, అర్ధరాత్రి ఛైర్మన్ ఛాంబర్‌లో ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు, దళారులతో కలిసి ఉద్యోగులు మద్యం తాగారు. రాత్రిపూట బ్యాంక్‌లో బజ్జీలు తింటూ.. ఉద్యోగులు మందు తాగుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై తీవ్ర చర్చ జరుగుతోంది.

## కొండను ఢీకొట్టిన విమానం.. 29 మంది మృతి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** రష్యాకు చెందిన ఏఎన్-26 సైనిక రవాణా విమానం ప్రమాదానికి గురైంది. క్రిమియా ద్వీపకల్పంలో కొండను ఢీకొని కుప్పకూలింది. ప్రమాదంలో ఆరుగురు సిబ్బందితో సహా మొత్తం 29 మంది మృతి చెందినట్లు రష్యా రక్షణ శాఖ ధ్రువీకరించింది. సాంకేతిక లోపం వల్ల ఈ ఘోర ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు.

## ఇరాన్‌పై 16వేల బాంబులు: ఇజ్రాయిల్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** యుద్ధం మొదలైనప్పటి నుంచి తమ వైమానిక దళం ఇరాన్‌పై 16వేల బాంబులు వేసిందని ఇజ్రాయిల్ ప్రకటించింది. 4వేల లక్ష్యాలపై 10వేలకు పైగా దాడులు చేసినట్లుగా వెల్లడించింది. మిలటరీ హెడ్‌క్వార్టర్లు, అణుస్థావరాలు, మిసైల్ లాంఛర్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను ధ్వంసం చేసినట్లు తెలిపింది.

## కొండగట్టులో 15 మంది భక్తులకు గాయాలు



**అక్షరటుడే, జగిత్యాల :** కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయంలో అపశృతి చోటు చేసుకుంది. ఆలయం వద్ద వేసిన చలువ పందిరి కూలిపోయింది. ఈ ఘటనలో 15 మంది భక్తులు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పందిళ్లను సరి చేయడానికి చర్యలు చేపట్టారు.

## యుద్ధం ముగింపుపై ట్రంప్ కీలక వ్యాఖ్యలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** యుద్ధం ముగింపుపై తాజాగా ట్రంప్ ప్రకటన చేశారు. హార్ముజ్ ప్రస్తావన లేకుండానే యుద్ధం ముగింపుపై స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈ విషయమై ఆయన జాతినుద్దేశించి ప్రసంగించనున్నారు. అమెరికాతో అగ్రిమెంట్ చేసుకోవాలని ఇరాన్ తహతహలాడుతోందన్నారు. త్వరలోనే ఈ డీల్‌ను ఫినిష్ చేస్తామని చెప్పారు. యుద్ధంతో నష్టపోయిన ఇరాన్ కోలుకోవడానికి 15-20 ఏళ్ల సమయం పడుతుందని తెలిపారు. ఇరాన్‌లో అమెరికా సైనిక చర్యలు వారాల్లో ముగియవచ్చని ట్రంప్ తెలిపారు. టెహ్రాన్‌తో అధికారిక ఒప్పందం లేకుండానే వాషింగ్టన్ తన సైనిక చర్యను ముగించే దశకు చేరుకుందని పేర్కొన్నారు.

## అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం

**అక్షరటుడే, ఏపీ:** అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలిపింది. ముందుగా బిల్లును కేంద్రం హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ ప్రవేశపెట్టారు. అనంతరం బిల్లుపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. ఆ తర్వాత పార్లమెంట్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. దీంతో ఈ బిల్లును గురువారం రాజ్యసభ ముందుకు తీసుకెళ్లనున్నారు. ఇక ఈ బిల్లుకు ఎన్డీఏ, కాంగ్రెస్ ఎంపీలు మద్దతు ఇచ్చారు. కానీ వైఎస్సార్ సీపీ మాత్రం దీనిని వ్యతిరేకించింది. కాగా.. అమరావతికి చట్టబద్ధత తెలపడంపై రాష్ట్ర కూటమి ఎంపీలు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.



# ఉమ్మడి పౌరస్మృతి అమలు చేస్తాం

బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే అస్సాంలో యూనిఫాం సివిల్ కోడ్ అమలు చేస్తామని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. ఆరో షెడ్యూల్ కింద గిరిజనులకు రక్షణ కల్పిస్తామన్నారు. అస్సాం ఎన్నికల ప్రచారంలో భాగంగా గోఘామ్ముఖ్‌లో ప్రధాని మోదీ బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ అస్సాం ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. శించారు. అస్సాంలో చొరబాట్లను ఆ పార్టీ ప్రోత్సహించిందన్నారు.

– అక్షరటుడే, నేషనల్‌డెస్క్

- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ
- అస్సాంలో ఎన్నికల ప్రచారం
- కాంగ్రెస్ చొరబాట్లను ప్రోత్సహిస్తోందని విమర్శలు

అస్సాంలో ఏప్రిల్ 9న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో గెలిచి హ్యాట్రిక్ సాధించాలని బీజేపీ భావిస్తోంది. ఈ మేరకు ఆ పార్టీ ప్రచారంలో దూసుకుపోతుంది. ఇందులో భాగంగా మోదీ సైతం ర్యాలీలు, బహిరంగ సభల్లో మాట్లాడుతున్నారు. మోదీ మాట్లాడుతూ.. అస్సాంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే, చొరబాటుదారులకు రక్షణ కల్పించే లక్ష్యంతో చట్టాన్ని తీసుకువస్తుందని ఆరోపించారు.

### విభజించడానికి యత్నం

దేశాన్ని విభజించడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తుందని మోదీ ఆరోపించారు. మెజారిటీ వర్గాన్ని మైనారిటీగా మార్చి, చొరబాటుదారుల శాశ్వత ఓటు బ్యాంకు ను సృష్టించడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. చొరబాటుదారులను రక్షించడానికి అస్సాంలో కొత్త చట్టాన్ని తీసుకువస్తామని కాంగ్రెస్ నాయకులు బహిరంగంగా చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ పదేళ్ల పాలనలో 'సేవ' 'సుపరిపాలన' కొత్త శకానికి నాంది పలికిందన్నారు.

### ఉపాధి అవకాశాలు

బీజేపీ మేనిఫెస్టోను ప్రధాని వివరించారు. యువతకు భారీ ఎత్తున ఉద్యోగ కల్పన, మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేస్తామన్నారు. ఈ పెట్టుబడుల ద్వారా వివిధ రంగాల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాల కింద అస్సాంలో ఇప్పటికే 22 లక్షల కుటుంబాలకు పక్కా ఇళ్లు లభించాయని మోదీ తెలిపారు. అదనంగా మరో 15 లక్షల మంది లబ్ధిదారులకు ఇళ్లను సమకూర్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

### రాహుల్‌పై విమర్శ

అస్సాం ఎన్నికల్లో బీజేపీ హ్యాట్రిక్ సాధిస్తుందని మోదీ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల్లో వంద ఓటములను చవిచూస్తుందని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీపై పరోక్షంగా విమర్శలు చేశారు. ప్రధాని మోదీ ఆయనను "కాంగ్రెస్ స్వీయ ప్రకటిత యువరాజు" అని అభివర్ణించారు. ఆయనకు వందో ఓటమి తప్పదని పేర్కొన్నారు.

## పినరయి విజయన్, మోదీ ఒక్కటే: సీఎం రేవంత్‌రెడ్డి



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కేరళం రాష్ట్రంలో త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో అన్ని పార్టీలు ప్రచారంలో జోరు పెంచాయి. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి అక్కడ ప్రచారం చేస్తున్నారు. రెండు రోజుల పాటు ప్రచారంలో పాల్గొనడానికి మంగళవారం సాయంత్రం కేరళం వెళ్లారు. బుధవారం ఉదయం నెమోమ్ నియోజకవర్గంలో రోడ్‌షో నిర్వహించారు. ఆయన ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార ఎల్‌డీఎఫ్ కూటమికి ఓటు వేస్తే అది ఢిల్లీలోని నరేంద్ర మోదీకి చేరుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మోదీకి, పినరయ్ విజయన్‌కు మధ్య తేడా లేదన్నారు. కేరళ ప్రజలు తెలివైన వాళ్లని, విద్యావంతులని సీఎం అన్నారు. నరేంద్ర మోదీ కేరళ అభివృద్ధి, భవిష్యత్‌ను కిడ్నాప్ చేస్తారని ఆరోపించారు. యూడీఎఫ్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు.

## రేషన్‌కార్డులు తొలగించే కుట్ర..: కవిత



**అక్షరటుడే, హైదరాబాద్:** రేషన్ కార్డులు తొలగించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. బుధవారం ఆమె నిరుద్యోగుల సమస్యలపై మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొన్నటి వరకు ఐదు లక్షల కార్డులు ఇచ్చామని చెప్పిందని, కానీ ప్రస్తుతం కార్డులను తొలగించడానికి చర్యలు చేపట్టిందన్నారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శులు ఐటీ కట్టిన వారి వివరాలు సేకరిస్తున్నారని ఆమె చెప్పారు. రేషన్ కార్డుల తొలగింపు కోసం చేపట్టిన సర్వేను ఆపాలని డిమాండ్ చేశారు. ఐటీ కట్టిన వారి కార్డులను తొలగించాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. మొత్తం 15 లక్షల కార్డుల తొలగింపునకు జరుగుతున్న సర్వేను నిలిపివేయాలన్నారు. నిరుద్యోగులకు అడ్డంకిగా ఉన్న జీవోలను వెంటనే రద్దు చేయాలని కవిత డిమాండ్ చేశారు.

## హైడ్రా దూకుడు.. ఐదు భవనాల కూల్చివేత

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** నగరంలో ఆక్రమణలపై హైడ్రా కొరఢా ఝుళిపిస్తోంది. తాజాగా రాజేంద్రనగర్‌లో అక్రమంగా నిర్మించిన పలు భవనాలను అధికారులు కూల్చివేశారు. మైలర్‌దేవ్‌పల్లి శాస్త్రినగర్‌లో ఆటస్థలాన్ని ఆక్రమించి కొందరు నిర్మాణాలు చేపట్టారు. దీనిపై హైడ్రాకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు అధికారులు బుధవారం ఉదయం రంగంలోకి దిగారు. జేసీబీలతో కూల్చివేతలు చేపట్టారు. నిర్మాణంలో ఉన్న ఐదు భవనాలు కూల్చివేశారు. రూ.100 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడారు. హైడ్రా అధికారులు, జీహెచ్ఎంసీ, రెవెన్యూ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో స్థలాన్ని తనిఖీ చేశారు. లేఅవుట్ ప్రకారం ఆ స్థలం క్రీడా మైదానం కోసమే కేటాయించినట్లు నిర్ధారించారు. అక్కడ నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరికలు జారీ చేశారు. బుధవారం ఉదయం తొలగింపు ప్రక్రియ చేపట్టారు. నిర్మాణంలో ఉన్న ఐదు 'G+3' (మూడు అంతస్తుల) భవనాలను తొలగించారు. అలాగే మరో రెండు గది నిర్మాణాలను సైతం నేలమట్టం చేశారు.



## వరుస సినిమాలతో దూసుకుపోతున్న నయన్ సారిక!



**టాలీవుడ్ వరుస సినిమాలతో దూసుకుపోతోంది యంగ్ హీరోయిన్ నయన్ సారిక. అందం, నటనా ప్రతిభ, సహజత్వంతో యూత్‌ను ఆకట్టుకుంటోంది. ఈ యంగ్ బ్యూటీ వరుస పెట్టి సినిమాలు చేస్తోంది. 'గం గం గణేశా' తో తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ చిన్నది.. 'క', 'ఆయ్' వంటి చిత్రాల్లో నటించింది. ఈ అమ్మడు సహజ నటన, పల్లెటూరి అమ్మాయి లుక్, ఎమోషనల్ ఎక్స్‌ప్రెషన్స్ ప్రేక్షకులను ఆకర్షించాయి. ముఖ్యంగా 'ఆయ్' మూవీలో ఆమె పెర్ఫార్మెన్స్ యూత్‌లో భారీ క్రేజ్ తెచ్చిపెట్టింది. అల్లు అర్జున్, జూనియర్ ఎన్టీఆర్ వంటి సీనియర్ ఆర్టిస్టులు కూడా ఆమె నటనను అభినందించడం గమనార్హం. ఆమె అందం మాత్రమే కాకుండా నటనా వైవిధ్యం, కథల పట్ల ఆసక్తి, ఇవన్నీ ఆమెకు టాలీవుడ్ యువ హీరోయిన్లలో ప్రత్యేక స్థానం సంపాదించి పెట్టాయి.**

-అక్షరటుడే, సినిమాడెస్క్

## ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి ఎన్‌హెచ్‌ఏఐ ఆమోదం



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో భారీ ఎలివేటెడ్ ఫ్లై ఓవర్ నిర్మాణానికి ఎన్‌హెచ్‌ఏఐ ఆమోదం తెలిపింది. ఎయిమ్స్ బీబీనగర్ వద్ద ఆరు లేన్ల ఫ్లై ఓవర్ నిర్మించనుంది. రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ఎన్‌హెచ్‌ఏఐ ఈ ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టనుంది. NH 163లోని హైదరాబాద్-యాద్గిర్ సెక్షన్‌లో ఉన్న ఈ ప్రాజెక్టుకు రూ.98.26 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. వైద్య సంస్థ సమీపంలో భద్రతాపరమైన ఆందోళనలు, ట్రాఫిక్ రద్దీని పరిష్కరించేందుకు దీనిని నిర్మించనున్నారు. ఈ ఫ్లైఓవర్ 690 మీటర్ల పొడవు ఉంటుంది. ఎయిమ్స్ ఆస్పత్రి సముదాయంలోని ప్రధాన, అత్యవసర గేట్లు రెండింటికీ సమగ్ర కవరేజీని అందించడానికి మొత్తం పరిధి 1.70 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది.

## గ్యాస్ కోసం ఆటో డ్రైవర్ల ఆందోళన



**అక్షరటుడే, హైదరాబాద్:** పశ్చిమాసియాలో ఉద్రిక్తత నేపథ్యంలో దేశవ్యాప్తంగా గ్యాస్ కొరత నెలకొన్న విషయం తెలిసిందే. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లకు ఇబ్బందులు లేకున్నా.. వాణిజ్య సిలిండర్లు, వాహనాలకు వినియోగించే గ్యాస్ దొరకడం లేదు. హైదరాబాద్ నగరంలో ఎంతో మంది ఆటో నడుపుతూ జీవనం సాగిస్తారు. చాలా వరకు ఆటోల్లో ఎల్‌పీజీ, సీఎన్‌జీ గ్యాస్ వినియోగిస్తున్నారు. ఈ గ్యాస్ కొరతతో తమ ఉపాధి దెబ్బ తింటుందని ఆటో డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. తాజాగా హైదరాబాద్ ఎల్బీనగర్ సాగర్ రింగు రోడ్డు వద్ద ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. గంటల తరబడి వేచి ఉన్నా గ్యాస్ లభించడం లేదని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్పీజీ గ్యాస్ కొరతను నిరసిస్తూ హైవేపై ఆటోలను అడ్డంగా నిలిపి నిరసన తెలిపారు. దీంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్యాస్ సరఫరాను క్రమబద్ధీకరించాలని వారు డిమాండ్ చేశారు.